సాక్షి పెద్దపల్లి

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



మండే ఎండ.. జాగ్రత్తలే అండ

ఎండలు మండిపోతున్నాయి.. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. వారం రోజులుగా వాతావరణలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 8లో▸



విధివంచిత పిల్లలకు.. 'మిషన్ వాత్సల్య'

విధివంచిత పిల్లలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని నిర్ణయించాయి. ఎటువంటి ఆదరణ లేని చిన్నారులకు చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0/26.0

ఆకాశం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. ఎండవేడిమి మరింత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

పొరుగువాడు ఆకలితో బాధపడుతుంటే తాను కడుపునిండా భుజించే వ్యక్తి విశ్వాసి కాజాలడు.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది 6.34	మంగళ 4.37

న్యూస్‌రీల్

నిత్యాన్నసత్రానికి రూ.5లక్షల విరాళం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్

మంథని: బీసీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటుపడాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. కాళేశ్వర మున్నూరు కాపు నిత్యాన్నసత్రం భూమిపూజ మహోత్సవ పోస్టర్‌ను మంథనిలో ఆదివారం ఆవిష్కరించారు. కుల సంఘాల్లో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. రాజకీయాలకు అతీతంగా సంఘ నిర్వహణ చేయాలని అభిప్రాయపడ్డారు. కాళేశ్వర క్షేత్రానికి చాలామంది భక్తులు వస్తుంటారని, వారికి నిత్యాన్నసత్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తనవంతు సాయంగా పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, ట్రస్టు చైర్మన్ బండి సంజీవ్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్, సింగిల్ విండో డైరెక్టర్ కొత్త శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

11న జ్యోతిబాపూలే జయంతి

సాక్షి, పెద్దపల్లి: ఈనెల 11న నిర్వహించనున్న మహాత్మజ్యోతిబాపూలే జయంతి కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ సంగీత తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లా కేంద్రంలో 11న ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో 197వ జయంతి ఉంటుందని, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.

12న జాబ్‌మేళా

సుల్తానాబాద్: ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు ఈనెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు తెలిపారు. హైదరాబాద్‌లోని సుస్థిర ఇన్ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ మేనేజర్ ఐదు పోస్టులకు ఇంటర్, డిగ్రీ అర్హతతోపాటు ఏడాది అనుభవం ఉన్న పురుషులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 20 పోస్టులకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హత గల స్త్రీ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని, ఉద్యోగస్థాయిని బట్టి నెలకు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు జిరాక్స్ సర్టిఫికెట్లతో పెద్దపల్లి ఐటీఐలో ఏప్రిల్ 12న ఉదయం 11 గంటలకు నిర్వహించే జాబ్‌మేళాకు హాజరుకావాలని, వివరాలకు 89853 36947, 95026 42441లో సంప్రదించాలని కోరారు.

- ఆసుపత్రుల ఆధునీకరణపై సింగరేణి నజర్..!
- 'ఖని'లోనే మోకాలు మార్పిడి ఆపరేషన్
- మెటర్నిటీ, చైల్డ్ వెల్ఫేర్ భవన నిర్మాణం కూడా..
- మైక్రోబయాలజీ విభాగం ఏర్పాటుకు నిర్ణయం



గోదావరిఖనిలోని ఏరియా ఆసుపత్రి

ఆధునిక వైద్యం.. కార్మికులకు అభయం

గోదావరిఖని: ఏరియా ఆసుపత్రుల ఆధునీకరణపై సింగరేణి సంస్థ దృష్టి సారించింది. ఏరియా ఆసుపత్రుల్లో కావాల్సిన వసతులు, పరికరాలు కల్పించేందుకు నిర్ణయించింది. యువ ఉద్యోగుల కోసం మెటర్నిటీ, చైల్డ్‌వెల్ఫేర్ భవన నిర్మాణంతోపాటు మోకాలు ఆపరేషన్.. బ్యాక్టీరియాను గుర్తించే మైక్రోబయాలజీ టెస్టింగ్‌ల్యాబ్ ఇలా.. అన్ని వసతులు ఆధునీకరించేలా దృష్టి సారించింది. ఇందుకు సుమారు రూ.3కోట్లు వెచ్చించి.. పలు విభాగాలు ఏర్పాటు చేస్తోంది.

కార్మిక కుటుంబాలకు ఆధునిక వైద్యం..

సింగరేణి కార్మిక కుటుంబాలకు అత్యాధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించిన యాజమాన్యం సుమారు రూ.3కోట్లు వెచ్చించి నూతన భవన నిర్మాణంతోపాటు పలు ప్రత్యేక వార్డులు నెలకొల్పనుంది. గోదావరిఖనిలోని ఏరియా ఆసుపత్రి రామగుండం, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి రీజియన్లకు చెందిన సుమారు 20వేల కార్మిక కుటుంబాలకు కేంద్ర బిందువుగా మారింది. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1, 2, 3, ఏపీఏ ఏరియా, బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల కార్మికులకు ఈ ఆసుపత్రిలో ఇప్పటికే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఈ లెక్కన సరాసరి 20వేల మంది కార్మికులు వారి కుటుంబాలతో కలిసి సుమారు 80వేల మందికి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతున్నాయి. వీరితో పాటు మరో 8వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇదే ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇక్కడే మోకాలు ఆపరేషన్

మోకాలు ఆపరేషన్ గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. బొగ్గు గనుల్లోకి వెళ్లి రావడం, ప్రస్తుత ఆహారపు అలవాట్ల మార్పులతో చాలామంది మోకాలు నొప్పుల బారిన పడుతున్నారు. మోకాలి చిప్ప అరిగిపోవడం, కార్పొరేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకోవడం సర్వసాధారణంగా మారింది. ఈ క్రమంలో గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో మోకాలి చిప్ప మార్పిడి ఆపరేషన్ చేసేలా యాజమాన్యం నిర్ణయించింది.

సంస్థలో పెరిగిన యువ కార్మికులు

కారుణ్య నియామకాలతో సంస్థలో యువ కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో మెటర్నిటీ(ప్రసూతి), చిన్నపిల్లల వార్డులకు డిమాండ్ పెరిగింది. ఏరియా ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న ప్రత్యేక విభాగం సరిపోవడం లేదు. దీనిపైనా దృష్టి సారించిన సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్, డైరెక్టర్లు ఏరియా ఆసుపత్రిని మరింత ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఏరియా ఆసుపత్రిలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులో రానున్నాయి.

వైద్య సేవల విస్తరణ



ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సేవలు విస్తరించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. గోదావరిఖనిలోని ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. మెటర్నిటీ, చిన్నపిల్లల కోసం ప్రత్యేక భవనం నిర్మించనున్నాం. మోకాలు ఆపరేషన్‌కు ఇక ఏరియా ఆసుపత్రిలో నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నాం. మైక్రో బయాలజీ యూనిట్ కూడా రానుంది.
– బలరాం, డైరెక్టర్(పా), సింగరేణి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మధు

రామగిరి(మంథని): బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యమని ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మండలంలోని పన్నూరులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రానికి కళ వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్, బీజేపీ చేతుల్లో పెడితే ముడుముక్కలు చేస్తారని విమర్శించారు. అవినీతి పాలన బీజేపీది, అభివృద్ధి పాలన బీఆర్ఎస్‌దని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో గులాబీజెండా ఎగరేందుకు ప్రతిఒక్కరూ కష్టపడాలన్నారు. టీఎస్‌టీఎస్‌సీ మాజీ చైర్మన్ సిరిమల్ల రాకేశ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎవరికి ఎలాంటి సమస్యలున్నా అధిష్టానం తప్పకుండా పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో జయశంకర్‌భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గీతాబాయి, యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, పార్టీ మండల అధ్యక్షులు శంకేసి రవీందర్, కిషన్ రెడ్డి, ఎంపీపీ ఆరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరవేణి శారద, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, ఏఎంసీ చైర్మన్ దాసరి రాజలింగు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పుట్ట, పూదరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు.

బీసీలు సమాజసేవకు ప్రతిరూపాలు



నరహరిని సన్మానిస్తున్న శ్రీమన్నారాయణ

సాక్షి, పెద్దపల్లి: పుట్టిన నేలను మర్చిపోకుండా సామాజిక సేవల ద్వారా ప్రజల హృదయాల్లో పిరికిపండ్ల నరహరి నిలిచిపోతున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాడూరి శ్రీమన్నారాయణ తెలిపారు. ఆదివారం బసంత్‌నగర్‌లోని నరహరిని ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి కారుపాక సరోజ, కన్నాల సర్పంచ్ మల్క రామస్వామి, నాయకులు కారుపాక మనోజ్‌కుమార్, తువ్వ హరీశ్, యాదవులు ఉన్నారు. బీసీ సాధికారిత ద్వారా జిల్లాలో రాజ్యాధికారం వైపు అడుగులు పడతాయన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కొత్తపల్లిలో సమస్యలు వింటున్న విజయరమణారావు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒరిగిందేమీలేదు
- మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు

సుల్తానాబాద్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలం కొత్తపల్లి రైల్వేగేట్, మూలసాల గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ నినాదంతో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు వింటుంటే స్థానిక ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాల్లో పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు కట్టించిందన్నారు. రైతులకు రుణమాఫీ అమలు కావడంలేదని అన్నారు. దళితబంధు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని వివరించారు. ధరణి సమస్యలతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించే అధికారి లేరని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కదర్ల శ్రీనివాస్, కొత్తపల్లి సర్పంచ్ శిలారపు సత్యం, కట్కూరి సుధాకర్ రెడ్డి, ఆరె సంతోష్, పేరుక సంతోష్, అర్కుటి సంతోష్ యాదవ్, ఎంచర్ల తిరుమలేశ్, ఎండీ.సుకూర్, కలవేన సంపత్, కెక్కర్ల సతీష్, అనిల్, రవి, మిడిదొడ్డి వెంకటేశ్, రాంమోహన్, అశోక్, ఓదెల, గన్నామనేని తిరుపతి రావు బండ శ్రీనివాస్, బొక్కల సంతోష్ పాల్గొన్నారు.

- అభివృద్ధిపై మాటల యుద్ధం
- బహిరంగ చర్చకు ఇరుపార్టీల సవాల్
- ఎక్కడికక్కడే అరెస్ట్ చేసిన పోలీసులు



ధర్మారం పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్




బీఆర్ఎస్ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న సీఐ, ఎస్సైలు.

ఎలిగేడు: ఎలిగేడు మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఎవరు ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా..? అంటూ ఇరుపార్టీల నాయకులు సవాల్ విసురుకున్న విషయం తెల్సిందే. అభివృద్ధిపై మండల కేంద్రంలో చర్చకు రావాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ నాయకులు సవాల్ చేయగా.. బీఆర్ఎస్ నాయకులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్దకు రావాలని ప్రతి సవాల్ చేసి అందుకు సిద్ధంకాగా.. అప్పటికే అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ సముదాయించారు. వినకపోవడంతో వారిని జూలపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అలాగే శివుపల్లి నుంచి కాంగ్రెస్ యూత్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు ఆధ్వర్యంలో కొంత మంది మండల కేంద్రానికి బయల్దేరుతున్నారన్న సమాచారంతో సీఐ, ఎస్సైలు వెళ్లి ధర్మారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండలకేంద్రంలోనే ఉన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, సుల్తాన్‌పూర్ సర్పంచు వెంకటేశ్వర్‌రావుతోపాటు మరికొంతమందిని ధర్మారానికి తరలించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మండలంలో అభివృద్ధి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు తమ ఉనికి తగ్గుతుందని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. దుగ్యాల సంతోష్‌రావు మాట్లాడుతూ అభివృద్ధిపై నిలదీస్తే పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడమేంటని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని నాయకులు ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని విమర్శించారు. అయితే సవాల్ ప్రతి సవాల్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ.ఖలీల్, సర్పంచ్‌లు కొండాల్‌రెడ్డి, కొండయ్య, విజయేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు రాయనర్సయ్య, మోహన్‌రావు, శరత్‌రెడ్డి, పోచయ్య, తిరుపతి, లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సంతోష్‌రావు, అమ్ముల శ్రీనివాస్, తిరుమల్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతియాదవ్ ఉన్నారు.

'ఆధార్'లో సవరణలు చేసుకోండి

- జూన్ 14 వరకు గడువు
- పిడుగుపడి పనిచేయని సుల్తానాబాద్ ఆధార్ సెంటర్
- ఎలిగేడు, జూలపల్లి, ముత్తారం మండలాల్లో కేంద్రాలే లేవు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఆధార్ కేంద్రం వద్ద గుమిగూడిన జనం

సుల్తానాబాద్: దేశంలో ఎక్కడైనా బ్యాంకు ఖాతా పొందడం, సిమ్ కార్డు తీసుకోవడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ వరకు ప్రతి పనికీ ఆధార్‌కార్డు ఉండాల్సిందే. ఈ క్రమంలో ఆధార్‌కార్డుల్లో పేర్లు, చిరునామా తదితర సవరణ చేయడంలో మోసాలు జరుగుతున్నాయని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పలు మార్పులు తీసుకొచ్చింది.

ఏదో ఒక ధ్రువపత్రం తప్పనిసరి..

ఆధార్ కార్డులో పేరు సవరించాలంటే తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డు పొందుపరచాలి. పదోతరగతి మార్కుల మెమో, ఓటరు గుర్తింపు కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదో ఒకటి జత చేయాలి. సబ్ రిజిస్ట్రార్ జారీ చేసే వివాహ ధ్రువపత్రం, తహసీల్దారు జారీ చేసే కుల ధ్రువీకరణ పత్రం సైతం సమర్పించవచ్చు.

వయసు వారీగా దరఖాస్తు పత్రాలు..

ఆధార్‌కార్డులో సవరణకు నూతన విధానం ప్రకారం వయసు వారీగా మూడు రకాల దరఖాస్తు పత్రాలు అందుబాటులోకి వచ్చాయి. ఐదేళ్లలోపు చిన్నారులకు, ఐదు నుంచి 18 ఏళ్లలోపు వారికి, 18 ఏళ్ల పైబడిన వారికి వేర్వేరుగా రూపొందించారు.

పదేళ్లకోసారి అప్‌డేట్ చేయాలి..

ఆధార్‌కార్డును పదేళ్లకోసారి అప్‌డేట్ చేయించాల్సి ఉంటుంది. ఆధార్ నవీకరణకు మార్చి 15 నుంచి జూన్ 14 వరకు మూడు నెలలపాటు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా చేసుకోవచ్చని ప్రభుత్వం ఇటీవలే ప్రకటించింది. అడ్రస్, ఐడీ ప్రూఫ్‌లను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, అప్‌డేట్ చేసుకోవచ్చు. అప్‌డేషన్ మాత్రమే ఉచితం.. సవరణలకు రుసుం చెల్లించాల్సిందే.

పుట్టిన తేదీ మార్పు కోసం..

చిన్నారులైతే తప్పనిసరిగా స్థానిక సంస్థలు జారీ చేసే పుట్టిన తేదీ ధ్రువపత్రం సమర్పించాలి. లింగ మార్పిడి కోసం అర్హత గల గుర్తింపు పత్రాన్ని జత చేయాలి. పుట్టిన తేదీ, లింగం మార్పునకు ఒకసారే అవకాశం ఉంటుంది. రెండోసారి మార్చాలంటే హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లాల్సిందే.

చిరునామా మార్పునకు..

ఆధార్ కార్డులో చిరునామా మార్పు చేయాలంటే కమిషనర్, తహసీల్దారు జారీ చేసే ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి. ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు ఖాతా పుస్తకం, విద్యుత్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ పుస్తకం తదితరాల ద్వారా మార్చుకోవచ్చు.

జిల్లాలో 266 గ్రామాలు..

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలు, రామగుండం కార్పొరేషన్ ఉన్నాయి. జనాభా 7,59,332 మంది. ఎలిగేడు, జూలపల్లి, ముత్తారం మండలాల్లో మీసేవ కేంద్రాలు లేవు. పిడుగు పడటంతో సుల్తానాబాద్ ఆధార్ సెంటర్‌కు సంబంధించిన సామగ్రి పనిచేయకుండా పోయాయి. ఏడాదిగా సుల్తానాబాద్‌తోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై తహసీల్దార్ యాకన్నను వివరణ కోరగా 15 రోజుల్లో బాగు చేయిస్తామని తెలిపారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి



సుల్తానాబాద్‌లో వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి. పిడుగు పడి పని చేయని సెంటర్‌ను బాగు చేయించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.
– మినుపాల ప్రకాశ్‌రావు, డీసీసీ కార్యదర్శి

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి



పదేళ్లకోసారి ఆధార్ కార్డు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. సవరణకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము మాత్రమే వసూలు చేయాలి. అదనపు తీసుకుంటే చర్యలు తీసుకుంటాం.
– లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ





ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి వారి ఆలయం ఆదివారం కొలాహలంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఒగ్గుపూజారులతో పట్నాలు వేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పాలక వర్గం ఏర్పాట్లు చేసింది.

క్లుప్తంగా

మంత్రి గంగులను కలిసిన గౌడ సంఘం నాయకులు



మంత్రి కమలాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌కు గౌడ సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం కరీంనగర్ పట్టణ శాఖకు సప్తగిరికాలనీలో రెండున్నర గుంటల స్థలాన్ని కేటాయించినందుకు పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, దిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, సంఘం ప్రతినిధులు యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, నాగుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌టీడీసీ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న సమ్మిరెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ) చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్‌ను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిషత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్: సమైక్య సాహితి, తెలంగాణ సాహితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజాకవి సుదర్శనం వేణుశ్రీ రాసిన 'ఓ ప్రచేతసా' పుస్తకావిష్కరణ, అంకితోత్సవం ఆదివారం భగత్‌నగర్‌లోని భగవతి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవిష్కర్త, కవి, రచయిత డాక్టర్ తంగిరాల చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రజల గురించి రాసిన సాహిత్యం ఎప్పుడూ సమాజంలో నిలబడుతుందన్నారు. కరీంనగర్ సాహిత్యానికి విశిష్ట స్థానంగా నిలుస్తోందని పేర్కొన్నారు. సాహితీవేత్త, జిల్లా సాహితీసంస్థల సమాఖ్య సాహితీ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ.. కలాలు వాస్తవాలను మాత్రమే తెలుపుతాయని, వర్తమాన సమాజ స్థితిని, గుణదోషాలను ప్రచేతసా శతకం చెప్పిందన్నారు. బిషప్ సాలవ జూనియర్ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ సంజీవరావుకు పుస్తకాన్ని అంకితం చేశారు. కూకట్ల తిరుపతి పుస్తక సమీక్ష చేశారు. రచయిత వేణుశ్రీతోపాటు భగవతి రమణారావు, డాక్టర్ కె.రామకృష్ణ, కేఎస్.అనంతాచార్య, సీహెచ్.రమణాచారి, డాక్టర్ బీవీఎన్.స్వామి, మాడుగుల రాములు ప్రసంగించారు. సమాఖ్య సాహితి అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యోగా సంపత్, ఎస్.నాగేంద్రశర్మ, కరుణాకర్, రాజయ్య, శ్రీకర్, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మండే ఎండ.. జాగ్రత్తలే అండ



నిర్మానుష్యంగా రాజీవ్ రహదారి

- పెద్దపల్లి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఆదివారం 38.2 డిగ్రీలు నమోదు
- మధ్యాహ్నం ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

జ్యోతినగర్(రామగుండం): ఎండలు మండిపోతున్నాయి.. సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.. వారం రోజులుగా వాతావరణలో మార్పులు చోటుచేసుకుంటుండటంతో పెద్దపల్లి జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం 38.2 డిగ్రీలుగా నమోదైంది. ఎండ వేడికి చాలామంది ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్న సమయంలో వడగాలులు వీస్తున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెలలో ఎండ మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంటున్నారు. మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాల్సి వస్తోంది. ఎండ వేడికి శీతల పానీయాల విక్రయాలు ఊపందుకున్నాయి.

వడదెబ్బ తగిలే అవకాశం..

ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. చెమట రాకపోవడం, విపరీతమైన దాహం, తల తిప్పడం, నాడీ వ్యవస్థ వేగంగా కొట్టుకోవడం, స్పృహ తప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముందుగా శరీరాన్ని తడి గుడ్డతో తుడవాలి. గాలి తగిలేలా చూడాలి. ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు


- సాధ్యమైనంతవరకు నీళ్లు ఎక్కువ తాగాలి.
- కాఫీలు, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి.
- నూలు దుస్తులు ధరించాలి.
- అవసరం అయితే తప్ప ఎండలో బయటకు వెళ్లరాదు.
- పిల్లలను సాయంత్ర 6 గంటలు దాటే వరకు బయటకు వెళ్లకుండా చూడాలి.

ఈ నెల 1వ తేదీ నుంచి ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
01	36.6	25.6
02	36.8	23.4
03	37.0	25.0
04	37.0	26.2
05	38.0	23.8
06	37.2	25.3
07	35.8	28.6
08	36.6	21.8
09	38.2	22.0

విధివంచిత పిల్లలకు.. 'మిషన్ వాత్సల్య'

- పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- నెలకు రూ.4 వేల ఆర్థికసాయం
- ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ



మిషన్ వాత్సల్య స్కీం లోగో

సుల్తానాబాద్(పెద్దపల్లి): విధివంచిత పిల్లలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని నిర్ణయించాయి. ఎటువంటి ఆదరణ లేని చిన్నారులకు చేయూతనిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. వారి విద్య, వైద్య అవసరాలు తీర్చేందుకు ఆర్థికసాయం అందించాలని మిషన్ వాత్సల్య అనే పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. అనాథలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), అమ్మానాన్న విడాకులు తీసుకున్నవారు, ప్రాణాంతకమైన వ్యాధి బారినపడి, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, బాల కార్మికులు, అక్రమ రవాణా బాధితులు, బాల యాచకులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు ఈ పథకం ద్వారా నెలకు రూ.4 వేల చొప్పున అందించనున్నారు.

పెద్దపల్లి జిల్లాలో 266 గ్రామాలు..

పెద్దపల్లి జిల్లాలో రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతోపాటు 266 గ్రామాలు ఉన్నాయి. జిల్లాలో రెండేళ్ల క్రితం కరోనా సమయంలో తల్లి లేక తండ్రి చనిపోయిన పిల్లలు ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య స్కీంను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఏడాది వార్షిక ఆదాయ పరిమితి..

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ సంవత్సరాల ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.95 వేలకు మించి ఆదాయం ఉండరాదు. జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. చిన్నారులను ఏదైనా వసతి గృహం, బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లేవారు 30 రోజులకు పైగా సక్రమంగా రాలేదని తెలిస్తే పరిశీలించి, సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

దరఖాస్తుల పరిశీలనకు కమిటీ..

సీడీపీవో కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటినీ మండల స్థాయి కమిటీ(తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్) నిశితంగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తుంది. దరఖాస్తులపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తర్వాత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కార్యాలయానికి పంపిస్తారు.

జత చేయాల్సిన పత్రాలు..

పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లి లేదా తండ్రి ఆధార్‌కార్డు, తల్లి లేదా తండ్రి డెత్ సర్టిఫికెట్, మరణానికి గల కారణాలు, గార్డియన్ ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బాలుడు లేదా బాలిక పాస్‌పోర్టు సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ వివరాలు, బాలుడు లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి, సంరక్షకులతో జాయింట్ అకౌంట్.

సీడీపీవోలకు ఆదేశాలిచ్చాం..



మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీవోలకు ఆదేశాలిచ్చాం. ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. తర్వాత వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తాం. – రవూఫ్, డీడబ్ల్యూవో, పెద్దపల్లి

మహాత్మా జ్యోతిబాపూలే జయంతికి రండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

కరీంనగర్: స్థానిక బైపాస్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఈ నెల 11న పూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ తెలిపారు. బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఓ కల్యాణ మండపంలో జరిగిన బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయుడు పూలే అన్నారు. స్త్రీలు విద్య నేర్చుకోవాలని, తన భార్య చేత పాఠశాలలు ఏర్పాటు చేయించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. స్థానిక పూలే గ్రౌండ్‌లో, శాతవాహన యూనివర్సిటీలో జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలేల విగ్రహాలను నెలకొల్పాలన్నారు. కరీంనగర్ పట్టణ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు బీసీ భవనం కోసం ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల రాజు, వరాల జ్యోతి, దొగ్గలి శ్రీధర్, కిరణ్, మురళి, దీప్తి, సంతోషిణి, సంజీవ్, రాకేశ్‌చారి, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- శాలపల్లెలో ఘటన
- అత్తింటివారు వరకట్నం కోసం వేధించేవారన్న మృతురాలి తండ్రి
- కేసు నమోదు



మౌనిక (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని సిద్దిపల్లె గ్రామపంచాయితీ పరిధిలోని శాలపల్లె గ్రామానికి చెందిన బిల్లా మౌనిక(25) అనే వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంథని మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మవాడ చెందిన ముడుతనపల్లి రాజయ్య కూతురు మౌనికను శాలపల్లెకు చెందిన బిల్లా హరీశ్‌కు ఇచ్చి, 2020 జనవరిలో వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రాజయ్య తమ్ముడు రవికి హరీశ్ ఫోన్ చేసి, ఇంట్లో పని చేస్తుండగా మౌనికను పాము కాటు వేసిందని చెప్పాడు. స్థానిక వైద్యుని వద్ద ప్రథమ చికిత్స చేయించి, అక్కడి నుంచి పెద్దపల్లికి, పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్తున్నామని తెలిపాడు. తాను, తన భార్య రాధ కరీంనగర్‌కు వెళ్లేసరికే తమ కూతురు చనిపోయిందని మృతురాలి తండ్రి రాజయ్య చెప్పాడు. మౌనికను తమ అల్లుడు హరీశ్‌తోపాటు కుటుంబసభ్యులు నిత్యం వరకట్నం కోసం వేధింపులకు గురిచేసేవారని తెలిపాడు. తమ కూతురి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు. మృతురాలికి మూడేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు.

చింతచెట్టు పైనుంచి పడి వృద్ధుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామంలో ఆదివారం చింతచెట్టు పైనుంచి పడి, కొమిరె వెంకటి అనే వృద్ధుడికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. చింతకాయలు దులుపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడని పేర్కొన్నారు. బాధితుడికి ఈఎంటీ సురేశ్ ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ ఆస్పత్రికి తరలించారని చెప్పారు.


నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కరీంనగర్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ నగేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులు ప్రాణత్యాగం వల్ల ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రం రాబందుల పాలైందన్నారు. తెలంగాణలో తమ భవిష్యత్ బాగుంటుందని కలలుగన్న నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ ఊరిస్తోంది తప్ప ఒక పోస్టును కూడా భర్తీ చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ బోర్డు అవినీతి ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం 1.91 లక్షల ఉద్యోగాలకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు రజితారెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కార్మిక విభాగం అధ్యక్షుడు పోలీస్ శ్రీనివాస్, నాయకులు నర్సయ్య, ఆంజనేయులు, సుంకర సునీల్, రియాద్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో వ్యక్తిపై దాడి



గాయపడిన శ్రీనివాస్‌గౌడ్

హుజూరాబాద్‌రూరల్: రాంపూర్ గ్రామంలో ఆదివారం గౌడ కులస్తుల పంచాయితీ జరిగింది. ఆ సమయంలో కుల పెద్ద మనిషి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆయనకు గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): ఏరియాల వారీగా సభ్యత్వాలను సేకరించి, ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలని ఆ సంఘం సెక్రటరీ జనరల్, వేజ్‌బోర్డు సభ్యుడు జనక్‌ప్రసాద్ కోరారు. ఆదివారం గోదావరిఖనిలోని జనక్ భవన్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ సెంట్రల్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం మహాసభ నిర్వహణపై చర్చించారు. 18న కోల్‌కతాలో జరగనున్న జేబీసీసీఐ వేజ్ బోర్డు సమావేశంలో యూనియన్ సమర్పించే డిమాండ్లపై మాట్లాడారు. రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, యూనియన్ ఫిట్‌స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు సమగ్రమైన కమిటీ నిర్మాణం, క్రమశిక్షణ కమిటీ ఏర్పాటుపై సమాలోచనలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ పాత్ర, కాంగ్రెస్‌తో అనుబంధంపై సమీక్ష జరిపారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, నరసింహారెడ్డి, త్యాగరాజన్, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, కాంపల్లి సమ్మయ్య, శంకర్‌రావు, శ్యాం, వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ మజ్దూర్లకు బేసిక్ ప్రొటెక్షన్ కల్పించాలి

అండర్ గ్రౌండ్ నుంచి సర్ఫేస్‌కు వచ్చే జనరల్ మజ్దూర్లకు బేసిక్ ప్రొటెక్షన్ కల్పించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. బెల్లంపల్లి ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఖాళీల భర్తీకి ఇచ్చిన సర్క్యులర్‌లో సీనియారిటీ, బేసిక్ ప్రొటెక్షన్ ఇవ్వలేదన్నారు. సర్ఫేస్ మజ్దూర్ల ఖాళీల భర్తీకై సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని కేటగిరీలకు చెందిన ఉద్యోగుల నుంచి దరఖాస్తులు కోరుతూ యాజమాన్యం నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. కానీ అందులో సర్ఫేస్ మజ్దూర్‌గా నియమించబడే వారికి గ్రేడ్, బేసిక్ వర్తించదని పేర్కొనడం సరికాదన్నారు. కేటగిరీ వన్‌లోనే ఉండాలని చెప్పడం అన్యాయమని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా సంస్థలో పనిచేస్తూ అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో సర్ఫేస్‌కు దరఖాస్తు చేసుకునే ఉద్యోగులను ఈ నిబంధన తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని, సీనియారిటీ గుర్తించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

- రామగుండం జీజీహెచ్‌లో ఘటన



చికిత్స పొందుతున్న వివేక్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వివేక్ అనే ఎలక్ట్రీషియన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం రామగుండంలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. ఆ సమయంలో మరమ్మతు చేపట్టాలని వివేక్ నిర్ణయించుకున్నాడు. ఆసుపత్రి ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి పని చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా జరిగి, విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనలో అతను ట్రాన్స్‌ఫార్మర్ పైనుంచి కిందపడగా తల, కాలు, చెయ్యి, ఛాతిపైన బలమైన గాయాలయ్యాయి. వివేక్ అపస్మారకస్థితిలో ఉండటంతో సిబ్బంది వెంటనే సీపీఆర్ చేసి, ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా.. విద్యుత్ సరఫరా రెండు గంటలపాటు ఉండదని ప్రకటించిన అధికారులు అకస్మాత్తుగా సరఫరా పునరుద్ధరించడం వల్లే ఈ ఘటన జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి విద్యుత్, ఆసుపత్రి అధికారులే బాధ్యత వహించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి మద్దెల దినేశ్ డిమాండ్ చేశారు. బాధితుడికి కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలన్నారు.

మోటార్ కార్మికుల పరిస్థితి దయనీయం

- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

జ్యోతినగర్(రామగుండం): మోటార్ రంగ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెరగడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. వారికి ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓట్ల కోసం కార్మికులను వాడుకుంటున్నారే తప్ప వారిని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రోడ్ సేఫ్టీ బిల్లు రద్దు చేయాలని, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు చెల్లించాలని, 50 ఏళ్ల వయసు దాటిన ప్రతీ కార్మికుడికి పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని తదితర అంశాలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, సహాయ కార్యదర్శి వెంకన్న, జిల్లా అధ్యక్షులు ఈ.నరేష్, అశోక్, కాంట్రాక్టు కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, నాయకులు బుచ్చయ్య, రవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు

- పెళ్లికి ఒప్పుకున్న ఇరుకుటుంబాలు



రాకేశ్ ఇంటి ఎదుట బైఠాయించిన పుష్ప

రామగిరి(మంథని): ఇద్దరూ ప్రేమించుకున్నారు.. నాలుగేళ్లుగా కలిసే ఉంటున్నారు.. ఈ క్రమంలో సదరు యువతి ఆ యువకుడిని పెళ్లి చేసుకోవాలని అడిగితే ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు అతని ఇంటి ఎదుట బైఠాయించి, నిరసన తెలిపింది. ఆమె వివరాల ప్రకారం.. ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లికి చెందిన పాలిశెట్టి రాకేశ్, పుష్ప ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో కలిసి ఉంటున్నారు. పుష్ప పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతీసారి దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇద్దరి కులాలు వేరు కావడంతో తమ ఇంట్లో ఒప్పుకోవడం లేదని రాకేశ్ తేల్చిచెప్పాడు. దీంతో ఆమె ఆదివారం ఖమ్మంపల్లికి వచ్చి, ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు ఇరు కుటుంబాలతో మాట్లాడి, ముత్తారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇరు కుటుంబాలవారు పెళ్లికి ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

ట్రస్మా ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ట్రస్మా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సాట్)లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని ఓ గార్డెన్స్‌లో రాష్ట్రస్థాయి ద్వితీయ ర్యాంక్ సాధించిన ఏడో తరగతి విద్యార్థినులు జి.లక్ష్మీప్రణతి, వి.విహిత, తొమ్మిదో తరగతికి చెందిన పి.వర్షిణి, తృతీయ ర్యాంక్ సాధించిన ఏడో తరగతికి చెందిన పి.హన్విత, కె.అక్షయ, తొమ్మిదో తరగతికి చెందిన ఎం.శ్రీవర్ధన్, క్లాస్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన చాట్ల శ్రీమాన్ (5వ తరగతి), జంగపల్లి సాత్విక, కె.ఆరుష్ (6వ తరగతి)లకు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, సెక్రటరీ సిరిపురం సత్యనారాయణ, ఈ–అభ్యాస్ అకాడమీ ఫౌండర్ ఫణి పవన్‌ల చేతులమీదుగా మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు. సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకర విజన్ సెంటర్ ప్రారంభం



పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పరికిపండ్ల నరహరి తన తండ్రి సత్యనారాయణ స్మారకార్థం కోయంబత్తూర్ శంకర విజన్ సహకారంతో నిర్మించిన కంటి ఆసుపత్రి భవనాన్ని(శంకర విజన్ సెంటర్) సోమవారం ప్రారంభించనున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి, కమెడియన్ అలీ, రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర నాయకులు, సింగర్ మంగ్లీ, ఇతర గాయకులు హాజరు కానున్నారు. ఉదయం 9 గంటలకు పరికిపండ్ల సత్యనారాయణ విగ్రహావిష్కరణ అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు అలయ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులతోపాటు ప్రముఖులు హాజరుకానుండటంతో పెద్దపల్లి సబ్ డివిజన్ పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సభా ప్రాంగణంతోపాటు పార్కింగ్ స్థలాలను పెద్దపల్లి సీఐ ప్రదీప్ పరిశీలించారు. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.